రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



కమిషనర్ రామ కృష్ణరావుకు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఉప సర్పంచ్ సుధీర్‌రెడ్డి

నిజాంపేట్: హెచ్ఎండీఏ అనుమతుల పేరుతో రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రగతినగర్ మాజీ ఉప సర్పంచ్ చల్లా సుధీర్‌రెడ్డి గురువారం కమిషనర్ రామకృష్ణరావును కలిసి ఫిర్యాదు చేశారు. ప్రగతినగర్‌లోని పట్టాభిరామాంజనేయ ఆలయం ఎదురుగా అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపడుతున్న ఓ బిల్డర్ 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించాడని, తాను ఈ విషయమై పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. అదే విధంగా ప్రగతినగర్‌లోని 13 పార్కుల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించాలని సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై స్పందించి కమిషనర్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి ప్రశాంతికి సైతం ఆయన లిఖిత పూర్వకంగా అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి



మృతుడు రాము (ఫైల్)

కుత్బుల్లాపూర్: మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు అందరు కలిసి తాగారు .. అర్ధరాత్రి ఏమైందో ..! ఏమో..!! తీవ్ర గాయాలతో తల నుండి రక్తం కారుతూ కనిపించాడు... కుటుంబ సభ్యులు స్థానికులతో కలిసి ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పెట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే దూలపల్లిలోని ఫాక్‌సాగర్‌లో ఓ కంపెనీలో పనిచేసే రాము అనే కార్మికుడు ఆదివారం రాత్రి 2.15 గంటల సమయంలో రక్తం మడుగులో పడి ఉన్నాడు. గమనించిన తోటి కార్మికులు అతని తమ్ముడు చిరంజీవికి సమాచారం అందించారు. అనంతరం అర్ధరాత్రి 108 ద్వారా సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల నుండి వెంటిలేటర్ పై చికిత్స పొందిన రాము గురువారం తెల్లవారుజామున మృతి చెందడంతో మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

అప్పటివరకు సరదాగా... అంతలో..!

మృతి చెందిన రాము రక్తం మడుగులో పడి ఉండగా తోటి ముగ్గురు కార్మికులు అతన్ని మెట్లపై నుండి పైకి తీసుకెళ్లి రక్తం ఏర్పడకుండా క్లాత్‌తో తుడవడం వంటి వీడియో దృశ్యాలు బయటకు రావడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఘటన జరిగిన రోజు సాయంత్రం నుండి రాత్రి వరకు తోటి కార్మికులతో తాగుతూ వచ్చిన రాము అర్ధరాత్రి సమయంలో తలకు తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉండడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఒకరు మెట్లపై నుండి కింద పడ్డాడని.. మరి కొంతమంది అతనితో కూర్చున్న ముగ్గురిలో సూరజ్, రాజకుమార్ పైనే అనుమానం ఉందని చెప్పడం విశేషం. వీళ్ళ ఇద్దరిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాము తమ్ముడు చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘డబుల్’ కేటాయింపులో అవకతవకలు’



విలేకరుల సమావేశంలో సతీష్ ముదిరాజ్

నిజాంపేట్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో చోటు చేసుకున్న అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం జ్యూడిషియల్ విచారణ చేపట్టాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం నిజాంపేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సతీష్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా వ్యవహరించారని, తమకు అనుకూలంగా ఉన్న వారికి రెండు చొప్పున ఇళ్లను మంజూరు చేయించారని ఆరోపించారు. గతంలో ఇళ్ల పొందిన వారికి సైతం మరో దఫా ఇళ్లు వచ్చాయని, ఒకే కుటుంబానికి రెండు ఇళ్లను ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ సెక్రటరీ అరుణ్‌రావు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ముఖేష్, ఉపాధ్యక్షుడు కుమార్‌గౌడ్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మాధవరావు, సీనియర్ నాయకుడు ఎల్లాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



కూన శ్రీశైలంగౌడ్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రజలు..

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు సంక్షేమ సంఘాలు, బస్తీలకు చెందిన నాయకులు గురువారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా పలువురు ఆయన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేశారు.

‘భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ సరైన ఎంపిక’



తాపీ మేస్త్రీలకు ప్రమాదబీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

రంగారెడ్డినగర్: సిమెంటు వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను తెలంగాణ రాష్ట్రంలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ శివ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని స్వస్తిక్ ట్రేడర్స్ డీలర్ దుకాణంలో తాపీ మేస్త్రీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర కంపెనీల సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి అల్ట్రాఫాస్ట్ సరైన ఎంపికని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారన్నారు. ఇతర బ్రాండ్‌లతో పోలిస్తే నిర్మాణాలు ఎంతో దృఢంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా భారతీ సిమెంట్ ఆధ్వర్యంలో 40 మంది తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను అందచేశారు. డీలర్ దేవేందర్, డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ అయ్యప్పరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

కార్మికుల కోసం నిరంతర పోరాటం



సీఐటీయూ జెండా ఎగుర వేస్తున భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

ఆల్విన్‌కాలనీ: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం అడ్డాలో సీఐటీయూ జెండాను గురువారం ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కూకట్‌పల్లి మండల అధ్యక్షులు బి. రాములు మాట్లాడుతూ... ఐక్యత పోరాటమనే నినాదంతో 1970 మే 30న సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలకు, వారి హక్కుల కోసం నిరంతరం వారి వెంట నిలబడి పోరాటం చేస్తుందన్నారు. అసంఘటిత కార్మికుల కనీస వేతనాలు, హక్కులు అములు చేయలేదన్నారు. పెరిగిన ధరల అనుగుణంగా కార్మికులకు కనీసం వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రజా పంపిణీ వ్యవస్థను ధ్వంసం చేసిందని.. తొమ్మిది రకాలు నిత్యావసరాల ఇవ్వకుండా కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారని తెలిపారు.

◆ 44 కేంద్ర కార్మిక చట్టాల్లో 29 చట్టాలు రద్దు చేసిందని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. అంగన్‌వాడీ మధ్యాహ్న భోజనం, ఉపాధి హామీ, నేషనల్ హెల్త్ మిషన్, సర్వ శిక్ష అభియాన్ రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో కోతలు విధించిందని తెలిపారు. ఫలితంగా రాష్ట్రంలోని అంగన్‌వాడీ, ఆశావర్కర్, ఏఎన్ఎం, మధ్యాహ్న భోజన కార్మికులు ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఐకేపీ వీవోఏ తదితరులను కార్మికులుగా గుర్తించటం లేదన్నారు. అదే విధంగా ప్రమాదకరమైన మోటార్ వాహన చట్టానికి సవరణ చట్టం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రమేష్ లాజర్, రాజు, శ్రీను, శ్రీశైలం, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించేలా అవగాహన



చెత్త వేయొద్దంటూ దేవేందర్ నగర్‌లో ఇల్లిల్లూ తిరుగుతూ బొట్టు పెడుతూ కోరుతున్న మహిళలు



చెత్తను తొలగించి ఆ ప్రదేశంలో బస్తీ వాసులతో క్యారం బోర్డ్ ఆడిస్తూ...

- ప్లీజ్ ..చెత్త వేయకండి అంటూ ఇల్లిల్లూ తిరిగి బొట్టు పెడుతూ విజ్ఞప్తి
- చెత్త వేసే ప్రాంతాలను శుభ్రంచేసి.. క్యారం బోర్డు ఆడుతూ సందడి
- అక్కడే టీ, టిఫిన్

సుభాష్‌నగర్: జనావాసాల మధ్య చెత్త పాయింట్ల వద్ద ఇకనుండి చెత్త వేయకుండా ఎవరూ చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ వినూత్న చర్యలు తీసుకుంటోంది. మన ఇంటి ముందుకి వచ్చే జీహెచ్ఎంసీ చెత్త బండిలో చెత్త వేసేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. స్థానికంగా ఉన్న మహిళా గ్రూపు సంఘాలు జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది సంయుక్తంగా కలిసి రోడ్ల పక్కన జనవాసాల, మధ్య చెత్త పోసే పాయింట్ పరిసర ప్రాంతాల్లో బహిరంగంగా చెత్త వేయొద్దంటూ ఇల్లిల్లూ తిరుగుతూ బొట్టుపెట్టే కార్యక్రమం చేపట్టారు.

◆ గురువారం గాజులరామారం డివిజన్‌లోని అన్ని ప్రాంతాలలో ఈ కార్యక్రమం చేపట్టారు. దేవేందర్‌నగర్‌లో సర్కిల్ టీఎల్ఎఫ్ జనరల్ సెక్రెటరీ సంధ్య, ఆర్‌పి సుగుణ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి బొట్టు పెడుతూ చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని, ఒకవేళ వేస్తే కలిగే దుష్ప్రభావాన్ని వివరించారు.

◆ చెత్త పాయింట్ వద్ద చెత్తను తొలగించి అక్కడ ముగ్గులు వేసి, స్థానికంగా ఉన్న వీధి బాలలతో క్యారం బోర్డ్ ఆడించారు.

◆ మరి కొన్ని చోట్ల ఆస్థానంలో శుభ్రం చేసి టిఫిన్ చేసి టీ తాగి స్థానికంగా ఉన్న ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సూపర్‌వైజర్లు పాండు, శ్యామ్ రావు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాబ్‌ను అడ్డగించి దోపిడీ..

నగదు, ఫోన్లు లాక్కున్న దుండగులు

జీడిమెట్ల: అర్ధరాత్రి అల్లరిమూకలు క్యాబ్‌ను ఆపి ఉద్యోగుల నుండి నగదు, సెల్‌ఫోన్‌లు లాక్కుని డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు.ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు.. గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు అనిల్ తన క్యాబ్‌లో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను మాదాపూర్ నుండి తీసుకువస్తున్నాడు. షాపూర్‌నగర్‌లోని నెహ్రూనగర్ వద్ద అదే ప్రాంతానికి చెందిన మున్నా, రాజాసింగ్, అఖిల్‌తో పాటు మరో ఇద్దరు యువకులు కలిసి మద్యం మత్తులో క్యాబ్‌ను అడ్డగించారు. క్యాబ్ డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ ఉద్యోగుల వద్ద డబ్బు డిమాండ్ చేశారు. వారు ఇవ్వకపోవడంతో నగదుతో పాటు సెల్‌ఫోన్‌లు లాక్కున్నారు. బ్లేడుతో డ్రైవర్ మెడపై గాయం చేసి పరారయ్యారు. గమనించిన స్థానికులు క్యాబ్ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ అస్పత్రిలో చేర్పించారు. క్యాబ్ డ్రైవర్ అనిల్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



మోతీనగర్: కబీర్‌నగర్‌లోని శివరామాంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా గురువారం కుంభస్థాపన, సుదర్శన హోమం నిర్వహించారు. గోవిందా గోవిందా నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ వేడుకలు జూన్ 1 వరకు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



మారుతినగర్ అసంపూర్తిగా రోడ్డును పూడ్చి వదిలేసిన దృశ్యం..

రంగారెడ్డినగర్: అసంపూర్తి అభివృద్ధి పనులతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్ కాలనీ, మారుతినగర్ లలో నెలకొన్న లోప్రెషర్ తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జలమండలి అధికారులు పైపులైన్ విస్తరణతో పాటు వాల్వ్ నిర్మాణ పనులను చేపట్టారు. మారుతినగర్ నాలా సమీపంలో రోడ్డును తవ్వి ఆ ప్రాంతంలో పనులు పూర్తి చేశారు. అయితే పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డుపై తవ్విన ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన ప్యాచ్‌వర్క్‌లు చేపట్టకుండా సిమెంట్ డస్ట్‌ను నింపి చేతులు దులుపుకున్నారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో నాలా ప్రాంతంలో మరింత ప్రమాదకరంగా మారుతోందని, సంబంధిత అధికారులు కల్పించుకుని రోడ్డు ప్యాచ్‌వర్క్ పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని సమీప కాలనీల ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జీబీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుండి మధ్యాహ్న 12.30 గంటల వరకు పీఎస్ఆర్ కన్వెన్షన్ రోడ్డు, రిలయెన్స్ పెట్రోల్‌బంక్, సయ్యద్ నగర్, ప్యారడైజ్ రోడ్డు, టొబాకో కంపెనీ, జీబీఆర్ కల్చరల్ క్లబ్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్‌లో..

11కేవీ సుచిత్ర ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుచిత్ర సర్కిల్, సుచిత్ర ప్రధాన రోడ్డు, వెస్ట్‌సైడ్, వెంకటేశ్వర కాలనీ, 11కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి 3.30 గంటల వరకు గ్రీన్ పార్క్, జీడిమెట్ల గ్రామం, భీమా ఫ్రైడ్, జీడిమెట్ల గ్రామ ప్రధాన రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని పేట్‌బషీరాబాద్ ఏఈ తెలిపారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీఐటీయూ నేతలు..

కుత్బుల్లాపూర్: భారతదేశంలో ఐక్యత పోరాటం అనే నినాదంతో సీఐటీయూ ఆవిర్భవించిందని ఆ పార్టీ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా షాపూర్‌నగర్‌లో ఆయన జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. పాలక ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు దేవదానం, పసుల అంజయ్య, సత్యం, కరుణాకర్, శీను, మల్లారెడ్డి, బీరయ్య, తిమ్మప్ప, నర్సింహులు, కనకయ్య, బాలయ్య పాల్గొన్నారు.

పుట్టమన్నుతో శివలింగాల తయారీ



వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శివలింగాలను తయారు చేస్తున్న మహిళలు

కుత్బుల్లాపూర్: ప్రతి కార్తీక మాసంలో నిర్వహించే అర్చన కార్యక్రమంలో మట్టితో తయారు చేసిన కోటిలింగాలను తయారు చేసి కాశీకి పంపిస్తున్నట్లు సభ్యులు అశోక్ గుప్తా, శ్రీధర్ గుప్తులు తెలిపారు. గురువారం పుట్టమన్ను సేకరించి కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని లింగాలను తయారు చేశారు. వీటిని కాశీలోని దేవాలయానికి అక్కడ జరిగే తొమ్మిది రోజుల కార్యక్రమంలో పెట్టనున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన శంకరమఠం వార్షికోత్సవాలు



శంకరమఠంలోని ఆది శంకరాచార్యులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ శ్రీ శృంగేరి శారద శంకరమఠంలో ఐదు రోజులుగా జరుగుతున్న 25వ వార్షికోత్సవాలు గురువారం ముగిసాయి. ముగింపు సందర్భంగా గురువందనం మూల విరాట్టుకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శారద మాతాకు మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం శారద అమ్మవారి నగర ఉత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు.

ఈ ఆసుపత్రులకు వసూళ్ల రోగం

- 2 నెలల్లో 5 ప్రైవేట్ ఆసుపత్రులు, 2 డయాగ్నోస్టిక్ సెంటర్లు,
- 2 అల్ట్రా మిషన్లు, ఒక ల్యాబ్ సీజ్, మరో క్లినిక్‌కు షోకాజ్
- ఫిర్యాదులు వస్తేనే తనిఖీలు చేస్తున్న వైద్యఆరోగ్యశాఖ
- ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడి.. పట్టించుకోక రోగులకు తిప్పలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అనుమతిలేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూళ్లకు తెగబడుతున్న ప్రైవేట్ ఆసుపత్రుల రోగం కుదిర్చేపనిలో వైద్య, ఆరోగ్య శాఖ పడింది. వాటికి గట్టి షాక్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఒక ఆసుపత్రికి అనుమతి తీసుకొని రెండు, మూడేసి బ్రాంచీలు తెరుస్తున్నాయని గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేస్తోంది. మరోవైపు కొన్నింటికి ఎలాంటి పరిశీలన, విచారణ లేకుండానే వైద్యారోగ్య శాఖ అనుమతులు ఇస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అవసరం లేకున్నా రకరకాల వైద్య పరీక్షలు చేస్తూ పేద రోగుల రక్తం పీల్చుతున్నాయని, అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, అల్ట్రా సౌండ్ సెంటర్లపై వైద్య శాఖకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను పట్టించుకోకుండా.. ఉల్లంఘించిన ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలకు జిల్లా వైద్యారోగ్యశాఖ సిద్ధవుతోంది.

కొరడా ఝుళిపిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ

ఫిర్యాదులతోనే తనిఖీలు.. చర్యలు

తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మార్చి 27న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వైద్య బృందం ఉప్పల్‌లోని శ్రీ మణికంఠ హెల్త్ కేర్ అండ్ పాలీ క్లినిక్, చిలుకానగర్‌లోని శ్రీ రాజు ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ నిర్వహించిన వైద్య బృందం అర్హత కలిగిన వైద్యులు, సిబ్బంది లేరని గుర్తించి, వాటిని సీజ్ చేశారు. సరైన దస్తావేజులు లేని చిలుకానగర్ మెసర్స్ మహాలక్ష్మి క్లినిక్‌కు నోటీసు జారీ చేశారు.

◆ ఏప్రిల్ 3న షాపూర్‌నగర్‌లో ఆర్‌ఆర్ శ్రీజన్ క్లీనిక్, శ్రీ వీరభద్ర ఫస్ట్ ఎయిడ్ క్లీనిక్, అన్నపూర్ణ ల్యాబ్‌లను తనిఖీ చేసిన వైద్య బృందం అర్హతలేని వైద్యులు, సిబ్బందితో వాటిని నడుపుతున్నారని గుర్తించి సీజ్ చేశారు. గత సంవత్సరంలో ఇదే సీజన్‌లో పీర్జాదిగూడలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన వైద్యబృందం స్థానికంగా ఉన్న పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించి మరో 4 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మే 14న ఉప్పల్‌లో వాసవి డయాగ్నోస్టిక్ సెంటర్ తోసహా శోభ సాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌లోని అల్ట్రా సౌండ్ యంత్రాన్ని సీజ్ చేశారు. మే 25న ఉప్పల్‌లోని ధనుంజయ్ డయాగ్నోస్టిక్ సెంటర్‌సహా అల్ట్రా సౌండ్ మిషన్‌ను సీజ్ చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, ఫిజియోథెరపీ, డయాగ్నోస్టిక్ సెంటర్లు, రిహాబిలిటేషన్ సెంటర్లపై కొరడా ఝుళిపించేందుకు వైద్యారోగ్యశాఖ సన్నద్ధమవుతోంది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, అనుమతులు తదితర అంశాలపై వైద్యారోగ్యశాఖ ఆరా తీస్తోంది.



నిబంధనలు ఇలా..

అల్లోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, కన్సల్టెంట్ క్లీనిక్‌లు, ఆయుష్ క్లీనిక్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలు అన్నింటికీ అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రి, క్లీనిక్, డయాగ్నోస్టిక్ కేంద్రాల నిర్వాహకులు అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, బయో వేస్ట్‌మేనేజ్మెంట్, పొల్యూషన్, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌సహా అన్ని రకాల పత్రాలు సరిగా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సి ఉంటోంది.

ఇష్టారాజ్యంగా వసూళ్లు

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు మొదలుకొని వైద్యపరీక్షలు తదితర వాటిల్లో కొనసాగుతున్న దోపిడీని పసిగట్టిన జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ బోర్డుల మీద ఫీజుల ధరల వివరాల పట్టికసహా డాక్టర్లు, సిబ్బంది, పడకల సంఖ్య వంటి సమాచారాన్ని పొందుపర్చాలని ఆదేశాలు జారీ చేసింది.

అనుమతిలేని ఆసుపత్రులు 895... స్కానింగ్ సెంటర్లు 400

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,500పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో రిజిస్ట్రేషన్‌సహా వివిధ అనుమతితో కొనసాగుతున్నట్లు ఆసుపత్రులు 1,605 మాత్రమే ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేని ప్రైవేట్ ఆసుపత్రులు 895 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా వేస్తోంది. అనుమతులు ఉన్న ఆసుపత్రుల్లో వంద కంటే ఎక్కువ పడకలు ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉండగా, 20 నుంచి 100 పడకలు(బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. 20 పడకలు(బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 294 ఉన్నాయి. 712 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, 180 డెంటల్ ఆస్పత్రులు, 46 ఫిజియోథెరపీ సెంటర్లు, 08 రిహాబిలిటేషన్ సెంటర్లు, 628 అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేని సాన్కింగ్ సెంటర్లు 400 వరకు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ అంచనా వేస్తోంది.